
# అయ్యా! మీకో నమస్కారం



**బొల్లిముంత వెంకట రమణారావు**

అప్పటికి అర్ధగంట నుండి సుందర్రావ్ తన కుర్చీలో "వెరీ అనీజీగా" నిట్టూరుస్తూ నిశ్శబ్దంగా బసులు కొడ్తున్నాడు. చేతిలోని కర్చీఫ్‌తో పదవసారి ముఖం తుడుచుకుని తన టేబుల్‌పైనున్న తన డిజిగ్నేషన్ క్రముక్కవైపు జాలిగా చూసి సరిగ్గా దానికి వ్యతిరేక భావమైన ఉక్రోషంత్తో చుట్టుప్రక్కల ఉద్యోగుల వంక బుస్సుమనే గాలిని వదిలాడు. ఇక లాభంలేదు, ఇవ్వాళ తాడోపేడో తేల్చుకుంటాను. అసలు వాళ్ళంతా నన్నేమనుకుంటున్నారు. కనీసం సాధారణ మానవుడికి వుండే డిగ్నిటీని కూడా గుర్తించకుండా మరీ ఇంత పలుచభావమా? అనుకుంటూనే సర్రున కుర్చీలో నుండి లేచి గునగునా మేనేజర్ గది వైపు దూసుకెళ్ళాడు.

"గుడ్‌మార్నింగ్ సార్!" అన్నాడు సుందర్రావ్. ఎదురుగా గుండ్రంగా, సౌమ్యంగా కిరాణా కొట్లో ఓ మూల చక్కగా కుదేసిన ఉప్పుబస్తాలా ఉన్న మేనేజర్ రాజశేఖరంగారు విలాసంగా నవ్వి "నమస్కారం! ఏంటీ విశేషాలు?.. యూ ఆర్ లుకింగ్ సమ్ వాట్ డల్!" అంటూ రహస్యాన్ని కనిపెట్టినవాడిలా కీచుగా సమాధానమిచ్చాడు.

"అబ్బ... బ్బా... బాగానే ఉన్నాన్సార్... కొంచెం మనసు..." అంటుండగానే "ఈ వయసులో హుషారూ, జోవియల్‌గా తారాజువ్వలాగుండాలోయ్. ఎనీ వే వాటీజ్ యువర్ ప్రాబ్లమ్? ఏమైనా పర్సనల్ ప్రాబ్లమా? బీ ఫ్రెండ్లీ చెప్పవోయ్ సుందరవదనా!" నవ్వాడు మేనేజర్. సుందర్రావ్ ముఖం అదోలా మారడం మొదలై కొద్దిసేపు వ్రేళ్ళని పరిశీలించుకుని మేనేజర్ కుర్చీ వెనక గోడపైనున్న గాంధీపటంవైపు చూసి ఒకసారి గొంతును చిన్న దగ్గుతో సరిచేసుకుని ఏదో చెప్పబోయేంతలో....

"కూర్చోవోయ్... టేక్ యువర్ సీట్ ప్లీజ్..." అంటుండగానే కుర్చీలో ముడుచుక్కూర్చుని "సార్... ష్యూరీ... మీరేం అనుకోకపోతే... నాదో చిన్న ప్రాబ్లం సార్... ఎలా చెప్పాలో అర్థం కావట్లేదు" అని మూడు గుటకలు మింగి ఆవులించబోయి... బలవంతాన చేయి అడ్డుపెట్టుకుని మళ్ళీ కర్చీఫ్‌తో ముఖం అద్దుకుని మళ్ళీ మేనేజర్‌ని చూడబోయి పైనున్న గాంధీని చూస్తూ "ఆఫీసులో నా సబార్డినేట్స్, కొలీగ్స్ కనీసం మినిమమ్ కర్టసీ కూడా నా పట్ల చూపట్లేదు సార్!" వేమన పద్యం కష్టంగా అప్పజెప్పిన స్టూడెంట్‌లా రిలాక్సయ్యాడు సుందర్రావ్.

"టెల్ మీ క్లియర్లీ, మిస్టర్ సుందర్రావ్... స్పష్టంగా చెప్పు" కొంచెం కుతూహలంతో ముందుకు వంగాడు రాజశేఖరం.

"కనీసం ఒక్కరు కూడా నాకు విష్ చేయట్లేదు సార్!" గట్టిగా గొణిగాడు సుందర్రావ్.

"నీవు చెప్పదల్చుకుంది ఖచ్చితంగా ఈ విషయమేనా?" సీరియస్‌గా అడిగాడు మేనేజర్ రాజశేఖరం.

"అవున్సార్... మరీ మ్యానర్‌లెస్‌గా బిహేవ్ చేస్తున్నారు సార్" ఏడుపు ముఖంతో కళ్ళల్లో దైన్యాన్ని నింపుకుని సమాధానం చెప్పాడు.

"ఓరి అసాధ్యంగూలా... ఈ పాటి దానికే ఇంత బాధపడాలోయ్... మై డియర్ సుందరం! మరీ ఇంత అమాయకుడివి ఎలా బ్రతుకుతున్నావోయ్?"

"ఎనీ వే ఐ షుడ్ సాల్వ్ యువర్ ప్రాబ్లం యాజ్ ఎర్లీ యాజ్ పాజిబుల్. ఓ.కే. టేక్ ఇట్ ఈజీ మై బోయ్... ఆ ఇంకా ఏమైనా ప్రాబ్లమా?" వంగి గ్లాసులో నీళ్ళు త్రాగుతుంటే "ఓ.కే. నేనొస్తాన్సార్... థ్యాంక్యూ వెరీ మచ్ సార్" అంటూ సర్రున బయటికొచ్చి మొదటిసారిగా

ఛాతిని ముందుకు ఉబ్బించి నిటారుగా వెళ్ళి తన సీట్‌లో హుందాగా కూర్చున్నాడు సుకుమార సుందర్రావ్. అతి త్వరలో ఆఫీసులో తనకు లభించబోయే గౌరవ మర్యాదల్ని తలుచుకుని కొంచెం సిగ్గు తగిలినట్లనిపించి ముసిముసిగా నవ్వుకుంటూ పనిలోకి జారుకున్నాడు. ఒక రకంగా పాపం సుందర్రావ్ తప్పేం లేదు ఈ విషయంలో. ఒక్కడే కొడుకవడం, అమ్మమ్మా, నాన్నమ్మల అతి గారాం మరి కాస్త తల్లిదండ్రుల అతి ప్రేమాభిమానాలతో పెరగడం వల్ల కొన్ని అతి లక్షణాలు సంక్రమించాయి. డాబు కొంచెం, సుపీరియారిటీ నైజం కొంచెం, ఇంకా కొన్ని రిపీటెడ్ వర్డ్స్ ప్రయోగించడం వల్ల ఉద్యోగంలో చేరిన సంవత్సర కాలంలోనే కార్యాలయంలోని సకల జనుల దృష్టిలో తన డిగ్నిటీ కోల్పోయినట్లు కలవరపడసాగాడు. ఆ రోజు రాత్రి ప్రశాంతంగా నిద్దరోయాడు. మరుసటి రోజు రోజులా కాక కొంచెం ప్రత్యేకంగా తయారై ఆఫీసు టైంకి పది నిముషాలు ముందుగానే వచ్చి తన కుర్చీలో గంభీరంగా కూర్చున్నాడు. సుందరం గంభీరతను బెదరగొడుతూ ఇంతలో టేబుల్‌మీద ఫోన్ గణగణమంటూ మ్రోగింది. ఇంకా పది గంటలు కూడా కాలేదు కొంపలంటుకుపోయే పని ఎవరికి వచ్చింది అనుకుంటూ ఫోన్ అందుకున్నాడు సుందరం.

"హలో! సుందరం హియర్"

"సార్! నేను క్యాజువల్ ఎంప్లాయ్ వాసునండి. మీరు అనుమతిస్తే ఒకసారి మీ దర్శనం చేసుకోవాలని...."

"ఇప్పుడు నాతో అంత పనేముంది? అయినా నేను ఏమైనా దేవుడ్నా? నా దర్శనం చేసుకోవడానికి."

"అది కాదండి దేవుడైతే నమస్కారం చేసింది,లేనిది అడగడు కదా. మీకు నమస్కారం చేసింది లేనిది బిగ్ బాస్ అడుగుతారు. అందుకని...."

"యూ ఫూల్..." అంటూ కోపంగా ఫోన్ పెట్టేశాడు. మరో ఐదు నిముషాలకు ఫోన్ గణగణమంది. ఆ ఫోన్‌ను ఒక భూతాన్ని చూస్తున్నట్లు కూర్చున్నాడు సుందరం. "ఏంటండి సుందరంగారు ఫోన్ మ్రోగుతుంటే తీసి మాట్లాడరు" అంటూ ప్రక్క సీట్‌లో కొలీగ్ ఫోన్ మ్రోగుతున్న విషయాన్ని గుర్తుచేశాడు. "ఆఁ ఏమీ లేదు" అంటూ ఫోన్ అందుకున్నాడు తప్పదని.

"హలో! సుందర్రావ్ హియర్."

"నమస్కారం సార్! నేను గరుడాచలంని పని వత్తిడి వల్ల మీ దగ్గరకు వచ్చి నమస్కారం చేయలేకపోతున్నాను. అన్యధా మరోలా భావించకండి" అంటూ ఫోన్ పెట్టేశాడు గరుడాచలం. ఆ ఫోన్ అలాగే పట్టుకుని దిగులుగా ఉండిపోయాడు సుందరం.

ఇంతలో ప్యూన్ రంగయ్య, సుందర్రావ్ దగ్గరకు వచ్చి "ఏంది సార్ అట్లా ఉన్నారు?" అంటూ పలకరించాడు. "ఏమైంది నా ముఖానికి బాగానే ఉన్నాను. వచ్చిన సంగతేమిటో చెప్పు. క్రింది సెక్షన్‌లో పనిచేసే సునీతమ్మగారు గీ ఉత్తరం మీకు ఇయ్యమన్నారు" అని ఉత్తరం టేబుల్‌మీద పెట్టాడు.

సుందరం చిరాకు పడుతూ ఈ ఆడవాళ్ళకు ఏమీ పని లేదు, మళ్ళీ సెలవు కావాలేమో అనుకుంటూ ఉత్తరం మడత విప్పాడు. "పని వొత్తిడి వలన మీ దగ్గరకు వచ్చి మిమ్మల్ని కలవలేకపోతున్నందుకు చింతిస్తున్నాను. నా నమస్కారాలను స్వీకరించగలరు" మీ సునీత అని ఉంది.

సుందరం ఒక్క ఉదుటున సీటులో నుంచి లేచి మేనేజర్ గది వైపు పరుగెత్తాడు.

రాజశేఖరంగారు ఎవరితోనూ ఫోన్‌లో మాట్లాడుతూ ఫోన్‌లో వ్యక్తి మాట్లాడుతున్న మాటలకు నవ్వసాగారు...

ఆ నవ్వు తనను చూసి నవ్వుతున్నట్లుగా అనిపించి దిగాలుగా తల వంచుకు కూర్చున్నాడు సుందరం.

రాజశేఖరంగారు తన ఫోన్ సంభాషణ పూర్తి కావటంతో ఫోన్ క్రెడిల్ చేసి "సుందరం మళ్ళీ ఏమిటి సమస్య?" అన్నారు.

సుందరం ఒక్క నిట్టూర్పు విడిచి, ఎవరెవరు ఏ విధంగా నమస్కారాలు చేసిందీ చెప్పాడు. "వాళ్ళ పనికి ఎలాంటి అంతరాయం కలగకుండా నమస్కారం చేయమన్నాను. చేశారు" ఇందులో వారి తప్పేమీ లేదంటూ నవ్వారు.

సుందరం బిక్కమొహం వేశాడు.

రాజశేఖరంగారు సుందరం అవస్థను చూసి "డోంట్ వర్రీ" ఏదో తప్పు చేసినవాడిలా ఏమిటీ ఆ పోజు "బి బ్రేవ్" అన్నారు. మళ్ళీ తనే సౌమ్యంగా సుందరం మన మంచితనం, మన మాట తీరులో ఎదుటివారిని ఆకట్టుకుని మన వంతు సహకారం అందించినట్లయితే మన రూపం వారికి కనిపించగానే, వాళ్ళ చేతులు ఎప్పుడూ మనకు నమస్కరిస్తాయి. మనం మనలోని అధికార దర్పాన్ని ప్రదర్శించి నమస్కారం పెట్టించుకోవటమనేది అహంకారం అవుతుందేగానీ అది మన గొప్పతనానికి నిదర్శనం కాదు. పెద్దవాడు కన్పించాడు ఒక నమస్కారం చేద్దాంలే అన్న మాట కాదు మనకు కావల్సింది. ఆత్మీయతా భావంతో చేసే నమస్కారమే మన వ్యక్తిత్వానికి వారి సంస్కారానికి అద్దం పడుతుంది అన్నారు. సుందరం ముఖంమీద ఒక చిరునవ్వు మెరిసింది. మీరు చెప్పిన మాటలు అక్షరాలా నిజం అంటూ థ్యాంక్స్ చెప్పి తన ఆఫీసు గది నుండి బయటకు వచ్చాడు.

❋

